
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

జగిత్యాల

జిల్లా వార్తలు

5★★

శుక్రవారం 12 జనవరి 2024

అక్షర సూర్యుడు అలిశెట్టి
నేడు అలిశెట్టి జయంతి, వర్ధంతి
7లో..

పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు
8లో..



రేషన్ దుకాణాలపై ఫోకస్

- బినామీ డీలర్ల ఏరివేతపై సర్కారు దృష్టి
- ఇప్పటికే అందిన మార్గదర్శకాలు
- తనిఖీలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు

జగిత్యాల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల్లో ఇప్పటి వరకు కొనసాగుతున్న బినామీ డీలర్ల ఏరివేతకు రంగం సిద్ధమైంది. ఇందుకు అనుగుణంగా ఇప్పటికే పౌరసరఫరా శాఖ అధికారులకు మార్గదర్శకాలు అందాయి. దుకాణాల తనిఖీలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను ఏర్పాటు చేశారు. అధికారులు రంగంలోకి దిగనుండడంతో బినామీల గుండెల్లో గుబులు నెలకొంది. దుకాణం బోర్డుపై డీలరు పేరు ఒకరిది ఉంటే నడిపేది వేరే వ్యక్తి ఉంటున్నారు. కొందరు డీలర్లు మృతి చెందితే ఆ స్థానంలో కుటుంబీకులకు ఇవ్వకుండా ఇతరులు చలామణి అవుతున్నారు. ఇక నుంచి బినామీ డీలర్లు అనే వారే లేకుండా చూడాలని పౌరసరఫరా శాఖ కమిషనర్ ఇటీవల ఆదేశించారు. ప్రతి రోజు దుకాణాలను తనిఖీ చేయాలని మార్గదర్శకాలు ఇచ్చారు.

జిల్లా వ్యాప్తంగా బినామీ రేషన్ డీలర్లు పదుల సంఖ్యలో ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారు ఏళ్ల తరబడి రేషన్ దుకాణాల్లో పాతుకుపోయారు. వాస్తవానికి డీలరు చనిపోయినా, రాజీనామా చేసినా కొత్త వారిని నియమించాలి. కానీ అది ఎక్కడా కనిపించడం లేదు. చాలా చోట్ల ఒకే డీలరు మూడు, నాలుగేసి దుకాణాలకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఇందులో పట్టణాల్లోనే ఎక్కువగా ఉన్నారు. కొందరికి రాజకీయ పలుకుబడి ఉండటంతో అధికా రులు వారి జోలికి వెళ్లడం లేదు. దీంతో వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. తాజా నిర్ణయం నేపథ్యంలో వారిపై చర్యలకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు.

జిల్లాలో రేషన్ డీలర్ల సంఖ్య..

జిల్లా వ్యాప్తంగా 587 రేషన్ దుకాణాలున్నాయి. ఇందులో రెగ్యులర్‌గా పనిచేస్తున్న డీలర్లు 505 మంది ఉన్నారు. 82 దుకాణాల్లో ఇన్‌చార్జిలు రేషన్ డీలర్లుగా వ్యవహరిస్తున్నారు. ఇందులో బీర్‌పూర్ మండలంలో 16 దుకాణాలకు గాను 15 మంది డీలర్లు, ఒకటి ఇన్‌చార్జి, బుగ్గారంలో 14 దుకాణాలకు గాను 13 మంది డీలర్లు, ఒకటి ఇన్‌చార్జి ధర్మపురి మండలంలో 34 మంది డీలర్లకు గాను 33 మంది డీలర్లు, ఒకటి ఇన్‌చార్జిలు నిర్వహిస్తున్నారు. గొల్లపల్లిలో 34కు గాను 32 మంది డీలర్లు, 2 ఇన్‌చార్జిలు, ఇబ్రహీంపట్నంలో 25కు గాను 21 డీలర్లు, 4 ఇన్‌చార్జిలు, జగిత్యాల అర్బన్‌లో 56కు గాను 50 డీలర్లు, 6 ఇన్‌చార్జిలు, కథలాపూర్‌లో 28కి గానూ 26 డీలర్లు, 2 ఇన్‌చార్జిలు, కొడిమ్యాలలో 30కి గాను 24 డీలర్లు 6 ఇన్‌చార్జిలు, కోరుట్లలో 51కి గానూ 45 డీలర్లు, 6 ఇన్‌చార్జిలు నిర్వహిస్తు న్నారు. మల్లాపూర్‌లో 37కి గానూ 32 డీలర్లు 5 ఇన్‌చార్జిలు, మల్యాలలో 28కి గానూ 21 డీలర్లు, ఏడుగురు ఇన్‌చార్జిలు, మేడిపల్లిలో 33కి గానూ 23 డీలర్లు, 10 ఇన్‌చార్జిలు, మెట్‌పల్లిలో 51కి గానూ 47 డీలర్లు, నలుగురు ఇన్ చార్జిలు, పెగడపల్లిలో 29కిగానూ 23 డీలర్లు, ఆరుగురు ఇన్‌చార్జిలు, రాయికల్‌లో 40కిగానూ 32 డీలర్లు, ఎనిమిది ఇన్‌చార్జిలు, సారంగపూర్‌లో 15కి గానూ 12 డీలర్లు, ముగ్గురు ఇన్‌చార్జిలు, వెల్గటూరులో 35కి గానూ 29 డీలర్లు, ఆరుగురు ఇన్‌చార్జిలు, జగిత్యాల రూరల్ మండలంలో 31కి గానూ 27 మంది డీలర్లు, నాలుగు దుకాణాలు ఇన్‌చార్జిలు నిర్వహిస్తున్నారు.

పక్కాగా పరిశీలిస్తేనే..

కొన్ని దుకాణాల్లో అసలైన డీలర్లు వేరే పని చేస్తున్నారు. మరికొందరు వేరే ప్రాంతాలకు వలస వెళ్లారు. తనిఖీల సమయంలో అసలైన డీలర్లను తీసుకొచ్చి దుకాణాల్లో కూర్చోబెట్టే అవకాశం ఉంది. ఇలా కాకుండా ఏళ్ల తరబడి నుంచి దుకాణం ఎవరు నడిపిస్తున్నారో కార్డుదారులను అడిగి తెలుసు కుంటే బినామీల బాగోతం బయట పడుతుంది. నామమాత్రంగా పరి శీలిస్తే వాస్తవాలు వెలుగు లోకి వచ్చే అవకాశాలు లేవు. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు అందినప్పటికీ సంబంధిత జిల్లా పౌర సరఫరా అధికారి సెలవుల్లో ఉండడం కారణంగా జిల్లాలో తనిఖీలు ఇంకా ప్రారంభం కానట్లు తెలుస్తోంది. ఒకటి రెండు రోజుల్లో జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత దృష్టికి తీసుకవెళ్లి తనిఖీలు చేయడానికి పౌర సరఫరా శాఖ అధికారులు సమాయత్తం అవుతున్నారు. తనిఖీల్లో అధికారులు పక్కాగా పరిశీలించా లన్న డిమాండ్ ప్రజల నుంచి వస్తోంది. తనిఖీలు ఎలా జరుగుతాయి ..రేషన్ దుకాణాల్లో బినామీలు ఉన్నారా.. వారి బోగోతం ఏమిటీ అన్నది ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాల సోదాల్లో తేలాల్సి ఉంది.

మార్గదర్శకాలు వచ్చాయి

వెంకటేశ్వర్ రావు, జిల్లా పౌరసరఫరాశాఖ అధికారి



రేషన్ దుకాణాలు తనిఖీ చేసి అసలైన డీలర్ ఎవరో గుర్తించాలని కమిషనర్ నుంచి మార్గదర్శకాలు వచ్చాయి. దీనికి అనుగుణంగా తనిఖీలు చేయిస్తాం. బియ్యం పంపిణీ సమయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలతో పాటు ఆర్డీవో, తహసీల్దారు దుకాణాలు పరిశీలిస్తారు. కమిషనర్ సూచించిన నిర్ణీత సమయంలో నివేదిక అందించడానికి చర్యలు తీసుకుంటున్నాము.

21వ తేదీలోపు నివేదికకు కసరత్తులు..

జిల్లాలోని అన్ని రేషన్ దుకాణాల్లో వచ్చే రెండు, మూడు రోజుల్లో విస్తృతంగా అధికారులు సోదాలు నిర్వహించనున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు, ఆర్డీవోలు, తహసీల్దారు, రేషన్ దుకాణాలను తనిఖీ చేస్తారు. దుకాణంలో ఉన్న డీలరు పేరు...రికార్డులో ఎవరి పేరుందో పరిశీలిస్తారు. బియ్యం నిల్వలు తనిఖీ చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. డీలరు చనిపోతే ఎప్పుడు వారి కుటుంబ సభ్యులు నడుపుతున్నారా.. ఇతరులెవరైనా కొనసాగిస్తున్నారా...అనేది పరిశీలిస్తారు. ఈ వివరాలు ఈ నెల 21వ తేదీ లోపు ప్రభుత్వానికి నివేదించడానికి అధికారులు కసరత్తులు చేస్తున్నారు.

రహదారుల అభివృద్ధికి నిధులు కేటాయించండి

మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డికి జీవన్‌రెడ్డి లేఖ

జగిత్యాల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పలు రహదారుల అభివృద్ధికి రూ. 50 కోట్లు నిధులు కేటాయించాలని కోరుతూ రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డికి ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి లేఖను రాశారు. గురువారం జగిత్యాలలో సంబంధిత లేఖ ప్రతులను విలేకరులకు అందించారు. జాతీయ రహదారి 63కు అనుసంధానంగా ఉన్న పలు రోడ్లను అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. నియోజకవర్గంలోని పొలాసా గ్రామం ఎన్‌హెచ్ 63 నుంచి ధర్మారం రోడ్డు లింక్ జగిత్యాల - పెద్దపల్లి హైవేకు రూ. 14 కోట్లు, అలూరు నుంచి లక్ష్మీదేవిపల్లి లింక్ అనంతారం క్రాస్ రోడ్డు ఎన్‌హెచ్ 63 వరకు రూ. 12 కోట్లు, ఉప్పు మడుగు నుంచి ద్యావన్‌పల్లి వరకు గల రహదారి అభివృద్ధికి రూ. 10 కోట్ల నిధులను ప్రత్యేకంగా కేటాయించాలని లేఖలో కోరారు. ఇందుకు అవసరమైన నిధులను 2024-25 కేంద్ర రోడ్ల మౌళిక వసతుల నిధుల నుంచి కేటాయించాలని కోరుతూ మంత్రి కోమటి రెడ్డికి వెంకట్ రెడ్డికి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి లేఖను పంపారు.

అనుమానితుల కదలికలపై సమాచారం ఇవ్వాలి

ఎస్పీ సన్ ప్రీత్ సింగ్



మాట్లాడుతున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

జగిత్యాల టౌన్, జనవరి 11: అనుమానిత వ్యక్తుల కదిలికలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని జిల్లా ప్రజలను ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ కోరారు. జిల్లాలో కొన్ని రోజులుగా వరుసగా జరుగుతున్న దొంగతనాలపై గురువారం అధికారులతో ఎస్పీ సమీక్ష నిర్వహించి మాట్లాడారు. సంక్రాంతి పండుగ దృష్ట్యా చాలా మంది ప్రయాణాలు చేస్తుండడంతో దొంగలు చేతివాటం ప్రదర్శించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. చోరీల నియంత్రణకు పోలీస్ శాఖ నిరంతరం గస్తీ నిర్వహిస్తున్నట్లు వివరించారు. దూర ప్రాంతాలకు వెళ్లేవారు తమ ఇంటి చిరునామా వివరాలను పోలీసులకు అందజేయాలన్నారు. అన్ని జాగ్రత్తలు పాటిస్తే దొంగతనాలను నివారించవచ్చునన్నారు. అలాగే ప్రభుత్వ నిషేదిత చైనా మాంజాను విక్రయించినా, ఉపయోగించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం సైబర్ నేరాల నియంత్రణపై అడిషనల్ డీజీపీ షిక గోయల్ నిర్వహించిన విడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ పాల్గొని జిల్లా పరిస్థితిని వివరించారు.

'సంక్రాంతి సెలవుల్లో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి'

జగిత్యాల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సెలవుల్లో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టి విద్యారంగాన్ని బలోపేతం చేయాలని కోరుతూ రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ రామ్ చందర్ నాయక్‌లకు పలువురు తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం నాయకులు వినతిపత్రం అందించారు. గురువారం హైద్రాబాద్‌లోని మారిగోల్డ్ హోటల్‌లో తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలను రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. ఈసందర్భంగా ఉపాధ్యాయుల సమస్యలను వివరించారు. గత ప్రభుత్వం అమానుషంగా తీసుకొచ్చిన 317 జీవో వల్ల రాష్ట్రంలో సుమారు 20 వేల మంది ఉపాధ్యాయులు స్థానికేతర జిల్లాలో సుదూర ప్రాంతాల్లో శాశ్వతంగా గెంటివేయబడ్డారని విన్నవించారు. వీరిని ప్రభుత్వం వెంటనే శావ్వత ప్రాతిపదికన సొంత జిల్లాలకు రీ అలోకేషన్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోవింద్ నాయక్, ప్రధాన కార్యదర్శి మోతిలాల్ నాయక్, జిల్లా విభాగం అధ్యక్షుడు నునావత్ రాజు పాల్గొన్నారు.

పండగ పూట ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పెగడపల్లి, జనవరి 11 : పండగ పూట ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మల్యాల సీఐ బిల్లా కోటేశ్వర్ పేర్కొన్నారు. గురువారం పెగడపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్.ఐ సతీష్‌తో కలిసి సీఐ విలేఖరులతో మాట్లాడుతూ సంక్రాంతి పండగకు పలువురు తమ ఇళ్లకు తాళం వేసి ఊరెళ్లే క్రమంలో పోలీస్ శాఖ తెలిపిన సూచనలు పాటించాలన్నారు. సంక్రాంతి పండగను ఆనందోత్సహాలతో జరుపుకోవాలని తమ ఇంటి నుంచి తాళం వేసి షాపింగ్ లేదా ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు కచ్చితంగా ఇంటి రక్షణ కోసం జాగ్రత్తలు తీసుకోవాలని, ఇంటిలో విలువైన ఆభరణాలు, నగదు ఉంచకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఊరెళ్లే వారు సాధ్యమైనంత వరకు ఇంటిలో ఒకరిని ఉండేలా చూడాలని, ఇంటికి తాళం వేసే వేరే ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు పోలీసులకు సమాచారం ఇస్తే ఆయా ఇంటి పరిసరాల పట్ల పోలీస్ పెట్రోలింగ్ చేయడానికి వీలుంటుందన్నారు. అత్యవసర సమయంలో 100 నంబరుకు డయల్ చేయాలని సీఐ కోటేశ్వర్ తెలిపారు.

అలిశెట్టి ప్రభాకర్ రచనలు అక్షర దీపికలు

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

జగిత్యాల టౌన్, జనవరి 11 :తెలంగాణ అక్షర సూరీడు స్వర్గీయ అలిశెట్టి ప్రభాకర్ రచనలు అక్షర కరదీపికలని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని శివసాయి రెసిడెన్సీలో గురువారం అలిశెట్టి ప్రభాకర్ జయంతి, వర్ధంతి ముందస్తు వేడుకలను కళాశ్రీ సహితీ వేదిక అధినేత గుండేటి రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌తో పాటు జడ్పీ చైర్ పర్సన్ దావ వసంతలు హాజరై ప్రభాకర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కళా రంగంలో విశేల సేవలందించిన ఆంధ్ర ప్రదేశ్‌తో పాటు తెలంగాణ రాష్ట్రానికి చెందిన జంగం స్వయంప్రభ, సిరిపురం వాణిశ్రీ, తిరునగిరి శరత్ చంద్ర, పగిడిపెల్లి సేరేందర్‌లకు అలిశెట్టి రాష్ట్ర స్థాయి పురస్కారాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అలిశెట్టిని తెలుగు సాహితీ లోకం మర్చిపోలేని గొప్ప కవిగా హృదయాలలో నిలిచారన్నారు. చిన్న చిన్న పదాలతో అనంత అర్థాలను చెప్పిన గొప్ప కవి ప్రభాకర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అలిశెట్టి ప్రభాకర్ తనయుడు సంగ్రాం, మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, అలిశెట్టి మాధవి రాజు, వుజగిరి జమున, మద్దెల సరోజన, అయిత అనిత, మోటూరి శ్రీనివాస్, చెట్ల చంద్రశేకర్, బుర్ర శ్యామల గౌడ్, లక్కరాజు శ్రీలక్ష్మి, పసుల రవి కుమార్, గుండేటి బేబి రాణి, సంకోజి రాధ శివ కుమార్ తదితరులు ఉన్నారు.



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే, జడ్పీ చైర్ పర్సన్

రేషన్ షాప్ డీలర్ల మాయాజాలం

బియ్యం పంపిణీలో కటింగ్ చేస్తూ మోసం

జగిత్యాల అర్బన్, జనవరి 11: లబ్ధిదారులకు పంపిణీ చేస్తే రేషన్ బియ్యంలో కటింగ్ చేస్తూ మోసాలకు పాల్పడుతున్నారు డీలర్లు. జగిత్యాల పట్టణంలో ఈ విషయం వెలుగుచూసింది. జగిత్యాల పట్టణంలో గల పురాణిపేట రేషన్‌షాప్‌లో లబ్దిదారులకు పంచే బియ్యంలో ఓ ఇటుకను వేసి, తరుగు తీస్తూ దర్జాగా ఎలక్ట్రానిక్ కాంటాపై తూకం వేస్తున్న దృశ్యం ఆశ్చర్యం కలిగించింది. ఇదే విషయంపై లబ్దిదారులు ప్రతి నెల ఇదే తంతు అంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం వల్లనే ఇలాంటి మోసాలు జరుగుతున్నాయని, ఉన్నతాధికారులు స్పందించి మోసాలకు పాల్పడే రేషన్ షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని లబ్దిదారులు కోరుతున్నారు. ఇదే విషయమై సివిల్ సప్లై అధికారులను ఫోన్‌లో వివరణ కోరేందుకు సంప్రదించగా కలెక్టర్ కార్యాలయంలో సమావేశంలో ఉన్నట్లు పేర్కొనడం గమనార్హం.

లిఫ్ట్ ఇరిగేషన్ పనుల పరిశీలన

రాయికల్, జనవరి 11: మండలంలోని జగన్నాథ్‌పూర్ గ్రామంలో ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్‌లను గురువారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇరిగేషన్ శాఖ అధికారులు పరిశీలించారు. వాటిని వెంటనే మరమ్మతులు చేసి రైతులకు ఉపయోపడేలా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ ఎస్ఈ అశోక్ కుమార్ డీఈఈ భాస్కర్‌ను ఆదేశించారు. వారి వెంట సంబంధిత శాఖ అధికారులు ఈఈ నారాయణ రెడ్డి, ఐడీసీ డీఈఈ మహేష్ చందర్ రావు, ఏఈఈ ధనుజయ్, డబ్ల్యూఐ లక్ష్మణ్ రెడ్డి ఉన్నారు. కాంగ్రెస్ నాయకులు పరాచ శంకర్, ఆత్రం భగవంత్ రావు, మాజీ సర్పంచ్ సీడెం భీం, పెందూరు మారుతి పాల్గొన్నారు.

యూనివర్సిటీ భూముల పరిరక్షణకు ఉద్యమిస్తాం

- ప్రభుత్వానికి పొలాస వ్యవసాయ కళాశాల విద్యార్థుల హెచ్చరిక
- కళాశాల బంద్‌కు పిలుపు - జీవో నెం.55 రద్దుకు డిమాండ్

జగిత్యాల అగ్రికల్చర్, జనవరి 11: ఆచార్య జయశంకర్ తెలంగాణరాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాయలం భూముల పరిరక్షణకు ఎంతటి ఉద్యమాలకైనా సిద్ధం అవుతామని పొలాస వ్యవసాయ కళాశాల విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. హైద్రాబాద్‌లోని వ్యవసాయ కళాశాల యూనివర్సిటీ భూ ముల నుంచి వంద ఎకరాల భూమిని రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు నూతన భవన నిర్మాణం కేటాయింపునకు తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ కళాశాల బంద్‌కు పిలుపునిచ్చిన విద్యార్థులు, అనంతరం పరిశోధన స్థానం ప్ర ధాన గేటు ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయంతో కేవలం యూనివర్సిటీ భూములు కోల్పోవడమే కాకుండా, హైకోర్టు నిర్మాణంతో వంద ఎకరాల్లో ఉన్న బయో డైవర్సిటీ దెబ్బతింటుం దన్నారు. వ్యవసాయ రంగంపై ఆధారపడ్డ రైతులకు భవిష్యత్‌లో భూమి కొరత కారణంగా నూతన పరిశోధనలకు ఇబ్బందికరంగా మారే ప్రమాదం ఏర్పడిందన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఆగ్రికల్చర్ విద్యార్థిలోకం హర్షించదన్నారు. తాము ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని, తమ హక్కుల సాధన, భావితరాల భవితవ్యం కోసం న్యాయం చేయాలని కోరేందుకే ఈ నిరస నలకు పిలుపు నిచ్చామన్నారు. పెద్ద మనసుతో ప్రభుత్వం స్పందించి యూనివర్సిటీ భూముల కేటా యింపు జీవో నెం 55ను వెంటనే ఉపసంహరించుకో వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ భూములను కాపాడుకునేందుకు భవిష్యత్‌లో ఎంతటి ఉద్యమాలకైనా సిద్దం అవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పొలాస వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



పరిశోధన స్థానం ప్రధాన గేటు వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ఆన్‌లైన్ ధ్యాన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

జగిత్యాల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): శ్రీరామచంద్ర మిషన్ ఉచిత ధ్యాన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో సంవత్సరం పాటు నిర్వహించనున్న శిక్షణను ఆసక్తిగల యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా హార్ట్ ఫుల్ నెస్ మెడిటేషన్ నిర్వాహకులు మంచాల కృష్ణ, కస్తూరి లక్ష్మీ వరకృష్ణ తెలిపారు. గురువారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. 15 నుంచి 35 ఏళ్ల వయస్సు లోపు ఉండి ఆసక్తి గల యువతీ యువకులకు ఒక సంవత్సరం పాటు ఉచిత శిక్షణను ఆన్‌లైన్‌లో అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వ్యక్తులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. కాగా ఈనెల 12వ తేదిన వివేకానంద జయంతి సందర్భంగా పట్టణంలోని విరూపాక్షి గార్డెన్స్‌లో వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా వివేకానంద జయంతిని పురస్కరించుకొని ప్రపంచ వ్యాప్తంగా లక్ష ఇరవై అయిదు వేల మంది యువతీ యువకులతో సామూహిక ధ్యానము నిర్వహించనున్నట్లు తెలిపారు. సామూహిక ధ్యానము ఉదయం 10 గంటలకు ప్రారంభమై 11 గంటలకు ముగుస్తుందన్నారు.

గల్ఫ్ హామీల అమలుకు కుంతియా చొరవ

జగిత్యాల, జనవరి 11, (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ఇచ్చిన హామీల అమలు కోసం కాంగ్రెస్ ఏఐసీసీ నాయకులు రాంమంద్ర కుంతియా చొరవ తీసుకొని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చిం చినట్లు టీపీసీసీ ఎన్నారై సెల్ చైర్మన్ వినోద్‌కు మార్, కన్వీనర్ మంద భీంరెడ్డి తెలిపారు. ఈసందర్భంగా హైద్రాబాద్ గోల్కొండ హోటల్‌లో కుంతియాకు పుష్పగుచ్చం అంద జేసి ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో నరేష్‌రెడ్డి, స్వదేశ్, మురళీధర్‌రెడ్డి, జితేం దర్‌రెడ్డి, జానయ్య, పాల్గొన్నారు.

సీఎంఆర్ అప్పగించకుంటే చర్యలు తప్పవు

కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ యస్మిన్ బాషా

జగిత్యాల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రైస్ మిల్లర్లు సకాలంలో సీఎంఆర్ అప్పగించకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ షేక్ యాస్మిన్ బా షా, అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. గురువారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో వానాకాలము 2022-23 సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ చెల్లింపులపై రైస్ మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సీఎంఆర్ బకాయిలున్న రైస్ మిల్లర్లు ఈనెల 31వ తేదీలోపు చెల్లించాలని ఆదేశించారు. లేకుంటే ఆ రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లయి అధికారి వెంకటేశ్వర్ రావు, జిల్లా మేనేజర్ హతీరాం నాయక్, జిల్లా రారైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మైలారపు రాంబాబు, నాయకులు రమేశ్, బట్టు ప్రవీణ్, దువ్వ రాజు, పలువురు పారా బాయిల్డ్ రైస్ మిల్లర్లు, రా రైస్ మిల్లర్లు, సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఓబన్న పోరాట స్ఫూర్తిని భావి తరాలకు చాటిచెప్పాలి

- ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్
- ఘనంగా వడ్డె ఓబన్న 217వ జయంతి

జగిత్యాల అగ్రికల్చర్, జనవరి 11: తొలితరం స్వాతంత్ర్య పోరాటంలో వడ్డే ఓబన్న పోరాటం వీరోచితమని, ఆయన పోరాట స్ఫూర్తిని భావి తరాలకు చాటిచెప్పాల్సిన అవశ్యకత మనపై ఉందని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బీసీ సంక్షేమ శాఖ అధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో తొలిసారి వడ్డే ఓబన్న 217వ జయంతిని అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా హాజ రైన వారు మాట్లాడుతూ ఓబన్న ఉయ్యాలవాడ నర్సింహారెడ్డికి వ్యక్తిగత సైనికుడిగా ఉంటూ, బ్రిటీషు సైన్యంపై చేసిన పోరాటం ఆదర్శనీయం అన్నారు. ఓ బన్న చరిత్రను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. గత ప్రభుత్వంలో వడ్డెర కాలనీలను గ్రామపంచాయి తీలుగా మార్చి ఆత్మగౌ రంతో పాటు, అధికార కల్పనకు కృషి చేయడంతో పాటు, బీసీ బంధు ద్వారా వడ్డెరల పనిముట్ల కొనుగోళ్లకు చొరవచూపిందన్నారు. కష్టాన్ని నమ్ముకొని పనిచేసేవారు ఒడ్డెర కులస్థులను అని, వారికి ప్రభు త్వం అండగా నిలిచే విధంగా తమవంతు చొరవతీసు కుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వల్లెపు మొగిలి, మున్సిపల్ చైర్మెన్ గోలి శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు సాయిబాబా, రాజ్‌కుమార్, ఆడెపు భాస్కర్‌తో పాటు బీసీ సంఘ బాధ్యులు లక్ష్మీనారాయణ, హరి అశోక్‌కుమార్, బ్రహ్మండభేరి నరేష్, ఈశ్వరయ్యతో పాటు సాంస్కృతిక సారధి బృందం సభ్యులు, వడ్డెర కులబాంధవులు పాల్గొన్నారు. కార్యక్రమ అనంతరం అతి థులను శాలువాతో సత్కరించారు.



ఓబన్న చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య


కోల సంతోష్(ఫైల్)

జమ్మికుంట రూరల్, జనవరి 1: జమ్మికుంట మండలం మడిపల్లి రైల్వే గేట్ సమీపంలో గురువారం ఆర్థిక ఇబ్బందులు తాళలేక గుర్తు తెలియని రైలు కింద పడి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ జి తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. వీణవంక మండలం శ్రీరాములపేట గ్రామానికి చెందిన కోల సంతోష్ (28) కమలాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్ కాంట్రాక్ట్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులు పడుతున్నా డు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై మడిపల్లి కెనాల్ సమీపంలో ద్విచక్ర వాహనం పార్క్ చేసి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య నాగమణి, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రైల్వే పోలీస్‌లు తెలిపారు.

బీరు సీసాతో దాడి.. ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, జనవరి 11: శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామానికి చెందిన నిజానపు శివాజీపై బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి బీరు సీసాతో దాడి చేశారు. ఈ ఘటనలో శివాజీ తలకు, చెంపకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. 108 సిబ్బంది ఈఎంటీ సతీష్‌రెడ్డి, పైలట్ ఖాజా ఖలీల్ లాల్‌లు సంఘటన స్థలానికి చేరుకొని హుజూరాబాద్ ఆస్పత్రికి తర లించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

శంకరపట్నం, జనవరి 11: శంకరపట్నం మండలం కొత్తగట్టుకు చెందిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల సమాచారం మేరకు.. శంకరపట్నం మండలంలోని కొత్తగట్టు గ్రామానికి చెందిన కామెడి సాంబశివరెడ్డి (48) ఈ నెల 10న ఇంటి నుంచి వ్యవసాయ బావి వద్దకు తన ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఆ సమయంలో హుజూరాబాద్ వైపు నుంచి ఎదు రుగా వస్తున్న సైదాపూర్ మండలం సోమారం గ్రామానికి చెందిన ములు గూరి జాన్ తన బైక్‌ను అజాగ్రత్తగా, అతివేగంగా నడుపుతూ కరీంనగర్-వ రంగల్ రహదారిపై కొత్తగట్టు శివారులో ఢీ కొట్టాడు. కింద పడిన ఈ సాంబశివారెడ్డికి తల భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొం దుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ జట్లు ఎంపిక పోటీలు

రామడుగు, జనవరి 11: రామడుగు మండల కేంద్రంలో ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి జట్ల ఎంపిక పోటీలు గురువారం నిర్వహించారు. ఈ నెల 17న ఆసిఫాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఇక్కడ ప్రతిభ చాటిన విద్యార్థులను ఎంపిక చేశారు. పోటీలను స్థానిక సర్పంచ్ పంజాల ప్రమీల ప్రారంభించారు. కార్యక్రమంలో చైర్మన్ వెంకటేశ్వర్‌రావు, కార్యదర్శి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాలలో చోరీ

జగిత్యాల టౌన్, జనవరి 11:జగిత్యాల జిల్లా కేంద్రంలోని పురాణిపేటలో చోరీ జరిగింది. గుర్తు తెలియని దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి అర తులం బంగారంతో పాటు రూ. 5 వేల నగదును అపహరించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పురాణి పేటకు నోముల సాగర్ కుటుంబ నెల రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి అమెరికాకు వెళ్లి గురువారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చారు. ఇంటి తలుపులకు ఉన్న తాళం పగులగొట్టి ఉండడం చూసి దొంగతనం జరిగినట్లుగా గుర్తించారు. దొంగలు ఇంట్లోకి చొరబడి బీరువా తాళాలు పగులగొట్టి విలువైన వస్తువులతో పాటు బంగారం, నగదు అపహరించుకవెళ్లారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. వేలి ముద్రలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నటేష్ పేర్కొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో నలుగురు డీబార్

గణేశ్‌నగర్, జనవరి 11: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ ఒకటి, మూడో సెమిస్టర్ పరీక్షల్లో మంగళవారం నలుగు రు విద్యార్థులను డీబార్ చేసినట్లు శాతవాహన యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో సెమిస్టర్ పరీక్షలో కరీంనగర్‌లోని ట్రినిటి డిగ్రీ కళాశాలలో ఇద్దరు, వికాస్ డిగ్రీ కళాశాలలో ఒకరు, అల్ఫోర్స్ డిగ్రీ కళాశాల లో ఒకరు మొత్తం నలుగురు విద్యార్థులు డీబార్ అయినట్లు తెలిపారు.

యువత దేశసేవలో పాల్గొనాలి

- ఎస్‌యూ ఉపకులపతి ఆచార్య సంకసాల మల్లేష్



శిక్షణా శిబిరానికి ఎంపికైన వలంటీర్లతో వీసీ ఆచార్య సంకసాల మల్లేష్

గణేశ్‌నగర్, జనవరి 11: జాతీయ సాహస శిక్షణ శిబిరాల్లో యువత పాల్గొని మానసిక, శారీరక దృఢ సంకల్పంతో దేశ సేవలో పాల్గొనాలని శాతావాహన యూనివర్సిటీ(ఎస్‌యూ) ఉపకులపతి ఆచార్య సంకసాల మల్లేష్ పిలుపునిచ్చారు. హిమాచల్‌ప్రదేశ్‌లో (నార్కంద) లోని అటల్ బిహారి వాజ్‌పేయి పర్వతారోహణ సంస్థలో శిక్షణ శిబిరానికి ఎంపికైన పదిమంది వలంటీర్లు తమ శిక్షణను పూర్తి చేసుకుని వచ్చిన సందర్భంగా వీసీ వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లు ఇంకా ఇలాంటి శిక్షణ శిబిరాల్లో పాల్గొని మానసిక, శారీరక దృఢ సంకల్పంతో దేశ సేవలో పాత్రులుగా కావాలని పిలుపునిచ్చారు. జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ ఈ మనోహర్ మాట్లాడుతూ వలంటీర్లు పర్వతారోహణ, ఇతర సాహస కార్యక్రమాల్లో శిక్షణ తీసుకున్నారని వీరు శాతవాహన యూనివర్సిటీలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులని, మంచి భవిష్యత్ ఉందని తెలిపారు. కార్యక్రమంలో శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రర్ ఆచార్య వరప్రసాద్ శిక్షణ శిబిరం కంటిన్జెంట్ లీడర్ శ్రీనివాస్, ప్రోగ్రాం ఆఫీసర్లు విజయ ప్రకాష్, డాక్టర్ తిరుపతి, డి విజయ్ కుమార్, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎక్స్‌కావేటర్ స్వాధీనం

శంకరపట్నం, జనవరి 11: శంకరపట్నం మండలం మక్త గ్రామ గుట్ట నుంచి అక్రమంగా మట్టి తవ్వుతున్న ఎక్స్‌కావేటర్‌ను గురువారం స్వాధీనం చేసుకున్నామని తహసీల్దార్ అనుపమ చెప్పారు. వెంచర్లకు ఎలాంటి అనుమతి లేకుండా మక్త గుట్ట నుంచి మట్టి తరలిస్తున్న ఎక్స్‌కావేటర్‌ను పట్టుకొని కేశవపట్నం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాలని తెలిపారు.

వృద్ధురాలిపై అత్యాచారం ఘటనలో ఒకరి అరెస్టు



మాట్లాడుతున్న సీఐ కిరణ్‌కుమార్

చందుర్తి, జనవరి 11: చందుర్తి మండలం లింగంపేట గ్రామ శివారులోని శ్మశాన వాటిక వద్ద వృద్ధురాలిపై అత్యాచారం ఘటనలో ఒకరిని అరెస్టు చేసినట్లు చందుర్తి సీఐ కిరణ్ కుమార్ తెలిపారు. గురువారం కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 9న కట్టలింగంపేట గ్రామానికి చెందిన ఆవునూరు తిరుపతి అనే వ్యక్తి ఒంటరిగా ఉన్న వృద్ధురాలిని బలవంతంగా తన ఆటోలో ఎక్కించుకొని లింగంపేట శివారుకు తీసుకెళ్లి ఆటోలో అత్యాచారం చేశాడు. తిరిగి ఆటోలో లింగంపేట బస్టాండ్ వద్ద వదిలిపెట్టి వెళ్లిపోయాడు. గురువారం ఉదయం నిందితుడు సనుగుల నుంచి వేములవాడ వెళుతున్నాడని సమాచారంతో మర్రిగడ్డ ఎక్స్ రోడ్ వద్ద పట్టుకున్నట్లు, ఆటో, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

9 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

కరీంనగర్ క్రైం, జనవరి 11 : కరీంనగర్‌లోని లక్ష్మీనగర్‌లో పేకాట ఆడుతున్న ఒక స్థావరంపై గురువారం కరీంనగర్ స్పెషల్‌బ్రాంచి సీఐ కే సృజన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి తొమ్మిది మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశారు. వారి వద్దనుంచి 1.40 లక్షల రూపాయలు, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని ఒకటో టౌన్ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ధర్మారం,జనవరి11: మండలంలోని బొమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన బొల్లి లచ్చయ్య(60) అనే వృద్ధుడు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడని ఎస్సై సత్యనారాయణ తెలిపారు. గత నెల 30న రాత్రి ఇంటి ముందు చలిమంట కాగుతుండగా మంటలంటుకున్నాయి. వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. మృతుని కొడుకు బొల్లి కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'అణగారిన వర్గాల అభ్యున్నతికి పోరాటం ఉధృతం'

గణేశ్‌నగర్, జనవరి 11 : జనాభా దామాషా ప్రకారం బీసీల వాటా కోసం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పోరాటాన్ని ఉధృతం చేయాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ బీసీలకు గురువారం పిలుపునిచ్చారు. బీసీ మహనీయుల జన్మ స్థలాలను సందర్శించే కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ జిల్లా కేంద్రానికి విచ్చేసిన తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహానికి నివాళులర్పించారు. చట్ట సభల్లో బీసీ వాటా, బీసీ హక్కుల సాధన కోసం అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఉద్యమాన్ని ఉధృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దుబ్బాక రమేష్, పెంట అజయ్ పటేల్, మునిగాంటి అశ్విన్, గిరిగాని భిక్షపతి, కార్యదర్శి తౌటం సత్యం, కాల్వ మధుబాబు, కాల్వ కిషన్, రాంపర్తి వికాస్, సాయికిరణ్, పాల్గొన్నారు.

పందెం కోడికి వేలం

భగత్‌నగర్, జనవరి 11: ఆర్టీసీ బస్సులో మరిచిపోయిన పందెం కోడికి నేడు కరీంనగర్-2 డిపోలో వేలం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ మల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తేదీన ఆర్టీసీ బస్సులో మరిచిపోయిన కోడికి సంబంధించి ఎవరూ రాలేదన్నారు. కరీంనగర్ అంబేద్కర్ బస్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు వేలం నిర్వహిస్తున్నట్లు ఆసక్తికల వారు వేలంలో పాల్గొనాలని కోరారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

కరీంనగర్ రూరల్, జనవరి 11: వ్యవసాయ కమిషనర్ ఆదేశాల మేరకు ఫెర్టిలైజర్ ఇన్వెంటోరీ వెరిఫికేషన్ సిస్టం ద్వారా కరీంనగర్ రూరల్ మండలంలోని గురువారం వ్యవసాయాధికారి బి సత్యం మూడు దుకాణాలను తనిఖీ చేశారు. తీగలగుట్టపల్లిలోని కేడీసీఎంఎస్, వల్లంపహాడ్‌లోని వాసవి ఫెర్టిలైజర్స్, నగునూరులోని అగ్రోస్ సెంటర్ దుకాణాలను తనిఖీ చేశారు. యూరియా, డీఏపీ, ఈపాస్ మిషన్‌తోపాటుగా నిల్వఉన్న ఎరువులు సరిపోయే వరకు ఆయా దుకాణాల పేర్లు ప్రతీ వారం తనిఖీ నిర్వహిస్తామని తెలిపారు.

చొప్పదండి: పట్టణంలోని ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి గురువారం తనిఖీ చేశారు. ఎరువుల నిల్వల వివరాలను నమోదు చేసుకున్నారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కొత్తకొండ జాతరకు ప్రతీ రోజు 80 ఆర్టీసీ బస్సులు

భీమదేవరపల్లి, జనవరి 11 : కొత్తకొండ జాతర బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని కొత్తకొండ జాతరకు ప్రతిరోజు హుజూరాబాద్ నుంచి 80ట్రిప్పుల ఆర్టీసీ బస్సులు నడపనున్నట్లు హుజూరాబాద్ డిపో మేనేజర్ శ్రీకాంత్ తెలిపారు. గురువారం కొత్తకొండ జాతరలో ఆర్టీసీ తాత్కాలిక బస్టాండ్‌ను పరిశీలించారు. బ్రహ్మోత్సవాలకు హుజూరాబాద్ డిపో నుంచి 20 బస్సులను రోజు 80ట్రిప్పులు నడపనున్నట్లు తెలిపారు. పెద్దలకు రూ. 60, చిన్నారులకు రూ. 30 టికెట్ ధర నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ప్రత్యేక బస్సులను హుజూరాబాద్ నుంచి వయా మాణిక్యాపూర్, ముల్కనూర్, కొత్తకొండకు ప్రయాణీకులను చేరవేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళా ప్రయాణికులకు ఉచితంగా జాతరకు చేరవేస్తామన్నారు. అనంతరం కొత్తకొండ శ్రీవీరభద్రస్వామిని దర్శించుకున్నారు. కాగా కొత్తకొండ జాతరకు రావాలని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు దేవాలయ అర్చకులు, సిబ్బంది గురువారం ఆహ్వాన పత్రం అందజేశారు.

అక్షర సూర్యుడు 'అలిశెట్టి'

- జగిత్యాల జైత్రయాత్రలో కలం ఎర్ర సూరీడై..
- సాహితీ మిత్రదీప్తితో కవిత్వంపై అభిలాష
- నేడు అలిశెట్టి జయంతి, వర్ధంతి



అలిశెట్టి ప్రభాకర్

జగిత్యాల/సిరిసిల్ల/కరీంనగర్ కల్చరల్ జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పద సంపద పరిమితమైన అపరిమితమైన భావసంపద ఉన్న కవిత్వం అతని సొంతం..పొట్టి పొట్టి వ్యాక్యాల్లో పొడవైన వాదాన్ని పూరించి సూటిగా ప్రశ్నించడమే ఆ..కవితల గొప్పతనం. పొట్టి కవితల్లో తన వాదాన్ని గట్టిగా వినిపించిన కవి అలిశెట్టి ప్రభాకర్. నిర్భయంగా, నిజాయితీగా తన మదిలో మెదిలిన ఆలోచనలను కలంలో నింపి, అక్షరాలను ప్రకాశింప జేసిన కవనసూరీడు అతడు. అలిశెట్టి జన్మించింది, మరణించింది ఒకే తేదీన కావడం యాదృచ్ఛికమైనా మరణం నా చివరి చరణం కాదు అని ప్రకటించిన అక్షర వీరుడిగా సాహితీ అభిమానుల్లో చెదిరిపోని ముద్రను వేసుకున్నాడు. నేడు అలిశెట్టి జయంతి, వర్ధంతి సందర్భంగా అందిస్తోన్న ప్రత్యేక కథనం..

● అడుగడుగున అలిశెట్టికి కష్టాలే...

జగిత్యాలలో 1956 జనవరి 12న జగిత్యాలలోని అంగడిబజార్ ప్రాంతంలో జన్మించిన అలిశెట్టి ప్రభాకర్‌కు ఏడుగురు అక్కాచెల్లెల్లు, ఇద్దరు అన్న దమ్ములు కాగా ప్రభాకర్ ఐదోవాడు. అలిశెట్టికి భార్య భాగ్యలక్ష్మితో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. బతుకు దెరువు కోసం తన అభిరుచులైన చిత్రలేఖనం, ఫొటోగ్రఫీని వినియోగించుకున్నాడు. సిరిసిల్లలో ఫొటోగ్రఫీ నేర్చుకుని, 1975లో జగిత్యాలలో పూర్ణిమ స్టూడియోను ప్రారంభించాడు. 1979లో కరీంనగర్‌లో స్టూడియో శిల్పి నడిపాడు. 1982లో హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు. 1983లో స్టూడియో చిత్రలేఖ స్థాపించాడు. హైదరాబాద్ నగర జీవితాన్ని 'ఆంధ్రజ్యోతి' దిన పత్రికలో సిటీ లైఫ్ సీరియల్‌గా రాశాడు.

● జగిత్యాల జైత్రయాత్రలో సాహితీ భాగస్వామ్యం..

సాహితీ మిత్ర దీప్తి సంస్థ పరిచయంతో కవిత్వంపై అలిశెట్టికి అభిలాష ఏర్పడింది. 1978లో జగిత్యాల జైత్రయాత్రతో తన కలం ఎర్ర సూరీడై ప్రజ్వలించింది. దోపిడి దారుల అకృత్యాలు, పెత్తందారుల అణిచివేత లతో సతమతమవుతున్న ప్రజల హృదయ ఘోషను తన కవితా వస్తువుగా మలుచుకున్నాడు. రగిలిన గుండె ఎర్రపావురమై ఎగిరి జైత్ర యాత్ర లో సాహితీ భాగస్వామ్యాన్ని అందించాడు. ఆ తదుపరి మంటల జెం డాలు, చురకలు, రక్తరేఖ, ఎండమావి, సంక్షోభ గీతం, సిటీలైఫ్ సంపుటా లు ముద్రితమయ్యాయి. అనారోగ్యం బారిన పడి 1993 జనవరి 12న అస్తమించాడు. అతడు అస్తమించినా అలిశెట్టి మినీ కవిత్వం ప్రతీ నోట వినబడుతోంది

● మారసం ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు

సాహితీవేత్త అలిశెట్టి ప్రభాకర్ జయంతి, వర్ధంతిని సిరిసిల్ల మానేరు రచయితల సంఘం ఘనంగా నిర్వహిస్తోంది. గురువారం సిరిసిల్లలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అలిశెట్టి కవిత్వంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయిని శారద మాట్లాడుతూ అలిశెట్టి ప్రభాకర్ మినీ కవితల ద్వారా సమాజ హితాన్ని కోరుకున్నారన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశం కూడా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మానేరు రచయితల సంఘం అధ్యక్షుడు టీవీ నారాయణ, కార్యానిర్వాహక అధ్యక్షుడు ఎలగొండ రవి, ప్రధాన కార్యదర్శి ఆడెపు లక్ష్మణ్, రచయిత బూర దేవానందం, ఉపాధ్యాయులు జయంతి, సతీష్‌బాబు, రమేష్, కరికె నరేందర్ పాల్గొన్నారు.



బాల్య మిత్రులతో అలిశెట్టి

నృసింహుడి ఆలయ హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

ధర్మపురి, జనవరి 11: ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం హుండీ లెక్కింపు గురువారం నిర్వహించగా రూ 54,21,314 ఆదాయం లభించింది. 95 రోజులకు సంబంధించిన హుండీలు తెరచి లెక్కింపు నిర్వహించగా ఈ ఆదాయం లభించింది. అలాగే 90 గ్రాముల మిశ్రమ బంగారం, 6 కిలోల 200 గ్రాముల మిశ్రమ వెండి, 31 విదేశీ నోట్లు లభించాయి. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కరీంనగర్ అసిస్టెంట్ కమిషనర్ ఎ. చంద్రశేఖర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, మున్సిపల్ వైస్‌ఛైర్మన్, ఆలయ రినోవేషన్ కమిటీ సభ్యులు ఇందారపు రామయ్య, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివా సాచార్యులు, సీనియర్ అసిసెంట్ అలువాల శ్రీనివాస్, ఆర్యవైశ్య సత్రం కోశాధికారి జక్కు దేవేందర్ పాల్గొన్నారు.

● ఆలయానికి స్టీల్ హుండీలు బహూకరణ

ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానానికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పక్షాన రూ 2 లక్షలు విలువ గల రెండు హుండీలను ఆ బ్యాంక్ డీజీఎం శంకర్ హేంబ్రం చేతుల మీదుగా గురువారం సమర్పించారు. ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం రెండు స్టీల్ హుండీలను ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్‌కు అందించారు. ఆలయం పక్షాన ఆయనను స్వామి శేష వస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో యుబీఐ జగిత్యాల జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ పొన్న వెంకటరెడ్డి, చీఫ్ మేనేజర్ సరల్‌గుప్తా, ధర్మపురి బ్రాంచ్ మేనేజర్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య

తంగళ్లపల్లి, జనవరి 11: తంగళ్లపల్లి మండల కేంద్రంలో చెన్నూరి పోశయ్య (30) అనే వలస కూలీ కుటుంబ కలహాలతో బుధవారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన చెన్నూరి పోశయ్య, చిట్టి దంపతులు మూడు సంవత్సరాల క్రితం తంగళ్లపల్లికి వలస వచ్చి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో భార్యభర్తలకు గొడవ జరగడంతో భార్య చిట్టి తల్లిగారింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెంది ఇంట్లోనే చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కమాన్‌పూర్, జనవరి 11 : మండలంలోని గుండారం గ్రామపరిధిలోని రాజేంద్రనగర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఝెంటిక్లయిన్ కాలనీకి చెందిన అభిషేక్ తన ద్విచక్ర వాహనంపై పెద్దపల్లి నుంచి స్వగ్రామం వైపు వస్తుండగా, గుండారం గ్రామానికి చెందిన పోలుదాసరి శేఖర్ తన ద్విచక్ర వాహనంపై రాజేంద్రనగర్ వైపు వస్తుండగా ఎదురెదురుగా ఢీకొన్నాయి. శేఖర్ కాలికి తీవ్ర గాయాలయ్యాయి. పెద్దపల్లి ప్రభుత్వా సుపత్రికి తరలించారు. పోలీసులు వివరాలను సేకరించారు.

రాష్ట్రస్థాయి అండర్-19 ఎస్‌జీఎఫ్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా జట్లు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 11: సిద్ధిపేట జిల్లాలో ఈ నెల 12, 13, 14 తేదీల్లో జరగనున్న తెలంగాణ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్ల వివరాలను జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పోతన శ్రీనివాస్ ప్రకటించారు. ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభచాటిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశామని తెలిపారు.

● ఎంపికైన జట్లు..

బాలికల విభాగంలో బి ప్రవళిక(ధర్మారం), జి అంజలి (ధర్మారం), బి వైష్ణవి(కొడిమ్యాల), కె వెన్నెల(కుమ్మరిపల్లి), ఆర్ పూజిత(కుమ్మరిపల్లి), గౌరి పూజిత(కరీంనగర్), ఆర్ అఖిల(కుమ్మరిపల్లి), టి శిరీష(ధర్మారం), సిరిచందన, లిఖిత(మానకొండూర్), బి జలజ(కొడిమ్యాల), బి లేఖన, ఎన్ వైష్ణవి(కుమ్మరిపల్లి), ఎన్ చరణి(ధర్మారం), జి కావ్య (కుమ్మరిపల్లి), బి శ్రావ్య(కొడిమ్యాల) ఎంపికయ్యారు.

బాలుర విభాగంలో ఆర్ అనిల్, ఆర్ హర్షవర్ధన్(మానకొండూర్), ఎ వర్షిత్(మల్యాల), ఓ సాయి, డి సిద్ధార్థ(ధర్మారం), ఎ మనోజ్‌కుమార్, టి అరుణ్ కుమార్, బి రాహుల్, సీహెచ్ రిషి(కుమ్మరిపల్లి), ఎ రోహిత్, కె అభినవ్(కరీంనగర్), టి బాలాజీ(దేవంపల్లి), డి శ్రీనివాస్(ధర్మారం), జె నాగరాజు(నందిమేడారం), ఎండీ రియామొద్దీన్(కేశవపట్నం) ఎంపికయ్యారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక జనవరి 11: మండలంలోని మాల్లారెడ్డిపల్లి గ్రామంలోని మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణ చేస్తున్నా ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణ చేస్తున్నా డ్రైవర్ రాయనవేని హరీష్, యాజమని రాయవేని సంపత్ పై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

మల్లికార్జున స్వామి హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

గొల్లపల్లి, జనవరి 11: ప్రముఖ పుణ్యక్షేత్రం మల్లన్నపేట మల్లికార్జున స్వామి దేవాలయం హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. ఈ సందర్భంగా హుండీ ఆదాయం రూ.22,37,246లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఇందులో హుండీ ద్వారా రూ.18,10,786, టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.4,26,460, మిశ్రమ బంగారం 10 గ్రాముల 500 మి.గ్రా., మిశ్రమ వెండి 790 గ్రాములు సమకూరినట్లు చైర్మన్ కొండూరు శాంతయ్య, ఈవో విక్రమ్, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ రవి కిషన్, నాయకులు సిద్ధంకి మల్లయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

గొల్లపల్లి, జనవరి 11: మండలంలోని శ్రీరాములపల్లె గ్రామానికి చెందిన బుర్ర గడ్డ శివ కుమార్ (21) గురువారం మృతి చెందాడు. గ్రామానికి చెందిన బుర్రగడ్డ లత-శంకరయ్య దంపతులకు ఒక్కగానొక్క కొడుకు శివ కుమార్ మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. శివ కుమార్ ఇటీవల గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉద్యోగ అన్వేషణలో ఉన్నాడు. తన పెద్దనాన్న గంగన్నతో కలిసి తాటి చెట్టు ఎక్కడానికి శ్రీరాములపల్లె గ్రామంలో రోడ్డు పక్కన ద్విచక్ర వాహనాన్ని నిలుపుతున్నాడు. ఈ క్రమంలో గొల్లపల్లి వైపు నుంచి హన్మాజీపేటకు చెందిన ప్రేమ్ కుమార్ అనే యువకుడు ద్విచక్ర వాహనంతో అతి వేగంగా ఢీకొట్టాడు. దీంతో బైక్‌పై ఉన్న శివ కుమార్‌తో పాటు గంగన్నలు రోడ్డు పక్కన ఎగిరిపడ్డాడు. ఈ ప్రమాదంలో శివ కుమార్ తలకు తీవ్ర గాయాలు కాగా, గంగన్నకు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన కుటుంబసభ్యులు జగిత్యాల ప్రధాన ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యుల సూచనల మేరకు కరీంనగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో శివకుమార్ మృతి చెందాడు. దీంతో శ్రీరాములపల్లె గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వివాహిత బలవన్మరణం

కోనరావుపేట, జనవరి 11: కోనరావుపేట మండలం బావుసాయిపేటలో వరకట్నం వేధింపులతో ఓ వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్య పాల్పడగా విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మృతురాలి భర్త, అత్తమామపై గొడవకు దిగారు. సంఘటన స్థలానికి చేరుకున్న వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి గొడవ జరగకుండా బందోబస్తు నిర్వహించారు. పోలీసుల కథనం ప్రకారం... కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామానికి చెందిన సయ్యద్ అస్లీమ్‌తో వేములవాడ మండలం ఫాజుల్‌నగర్ గ్రామానికి చెందిన నజీనా (21)కు రెండు సంవత్సరాల క్రితం పెళ్లి చేశారు. వివాహ సమయంలో ఐదు తులాల బంగారం, లక్ష రూపాయల నగదు, రెండు లక్షల బండి ఇచ్చి వివాహం చేశారు. వివాహం చేసిన అనంతరం ఆరు నెలలు బాగానే ఉన్నారు. అప్పటి నుంచి మరో రెండు లక్షల రూపాయలు కట్నం తేవాలని భర్త అస్లం, మామ హైదర్, అత్త గోరబి వేధించారు. మరోవైపు మూడు నెలల పాప కళ్లు కనిపించకుండా పుట్టడం నజీనాను కుంగ తీసింది. పాపకు హైదరాబాద్‌లో చికిత్స చేయించడానికి మూడు లక్షల రూపాయలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. భర్త పట్టించుకోకపోవడంతో వీరి మధ్య దూరం పెరిగింది. ఈ క్రమంలోనే మనోవేదనకు గురైన నజీనా గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఆత్మహత్య గల కారణాలను పరిశీలించారు. గొడవలు జరగకుండా వేములవాడ డీఎస్పీ నాగేంద్ర చారి, చందుర్తి సీఐ కిరణ్ కుమార్, కోనరావుపేట ఎస్సై ఆంజనేయు బందోబస్తు నిర్వహించారు. మృతురాలి తండ్రి మహమ్మద్ ఇచ్చిన ఫిర్యాదుతో భర్త అస్లం, మామ హైదర్, అత్త గురబీపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎస్‌బీఐ ఏటీఎం చోరీకి యత్నం

సిరిసిల్ల క్రైం, జనవరి 11: సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌లో ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీకి దొంగలు ప్రయత్నించారు. గురువారం తెల్లవారు జామున బీవైనగర్‌లోని ఎస్‌బీఐ ఏటీఎంలో దొంగలు చొరబడి బద్దలుకొట్టి దొంగిలించేందుకు యత్నించారు. ఈ చోరీ యత్నంపై ఏటీఎం సూపర్‌వైజర్ ఎస్.మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇళ్లల్లో చోరీ

కోల్‌సిటీ, జనవరి 11: గోదావరిఖని మార్కండేయ కాలనీ, వెంకటేశ్వరకాలనీలో బుధవారం రాత్రి తాళం వేసి ఉన్న నాలుగు ఇళ్లల్లో చోరీలు జరిగాయి. మార్కండేయ కాలనీలోని ఎండీ అహ్మద్‌పాషా ఇంటికి తాళం వేసి వెనుక గదిలో నిద్రిస్తుండగా ఇంటి తాళం పగులగొట్టి లోనికి చొరబడ్డ దొంగలు ఇంట్లోని తులంన్నర బంగారం, రూ.40వేల నగదు ఎత్తుకెళ్లినట్టు పోలీసులు పేర్కొన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముల్కనూర్ డెయిరీ సందర్శన

భీమదేవరపల్లి, జనవరి 11: ముల్కనూర్ మహిళా డెయిరీలో అమలు చేస్తున్న డీఐడీఎఫ్ ప్రాజెక్టును నాబార్డ్ అధికారులు గురువారం సందర్శించారు. నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ శ్రీనాథ్, అసిస్టెంట్ మేనేజర్ మహదేవ్ రెడ్డి పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేస్తే చర్యలు



విలేకరులతో మాట్లాడుతున్న ఏసీపీ జీవన్‌రెడ్డి

ఇల్లందకుంట, జనవరి 11: ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం ఇల్లందకుంట పోలీస్ స్టేషన్లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ఆదివారం రాత్రి ప్రకృతి వనాన్ని ధ్వంసం చేసిన నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. మండలంలోని సిరిసేడు, బోగంపాడు గ్రామాలకు ఇల్లందకుంట శివారులోని ఎర్రగట్టు గుట్టల సమీపంలో ఆ రెండు గ్రామాలకు ఎకరం భూమిని కేటాయించారని చెప్పారు. కానీ కొందరూ వ్యక్తులు ఆ ప్రకృతి వనాన్ని ధ్వంసం చేసి ఆ భూమిని అక్రమించేందుకు కుట్ర పన్నినట్లు వెల్లడించారు. ఆ స్థలంలో 2,450 మొక్కలు నాటారని చెప్పారు. సుమారు వాటి ఖర్చు రూ. 6,44,436 అయినట్లు వివరించారు. కాగా సిరిసేడు గ్రామానికి చెందిన ఎంపీటీసీ చిన్నరాయుడు, రేణికుంట్ల రామస్వామి ఆ భూమిని అక్రమించుకోవాలని కుట్ర పన్నారని చెప్పారు. ఈ క్రమంలో సిరిసేడు గ్రామానికి చెందిన సల్పల రమేశ్‌కు చెందిన ఎక్స్‌కావేటర్ సహాయంతో చెట్లను తొలగించారని చెప్పారు. సోమవారం ఉదయం ప్రకృతి వనాన్ని ధ్వంసం చేసిన సంఘటనపై పంచాయతీ కార్యదర్శి అంకూస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామని తెలిపారు. ఈ మేరకు చిన్నరాయుడు, రామస్వామి, సల్పల రమేశ్, ఎక్స్‌కావేటర్ డ్రైవర్ శశికుమార్‌లను గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. నిందితుల నంఉచి మోటర్ సైకిల్, ఎక్స్‌కావేటర్ స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ఆస్తులను ధ్వంసం చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సీఐ కిశోర్, ఎస్‌ఐ రాజకుమార్, సిబ్బందిని ఏసీపీ అభినందించారు. ఇంత జరిగిన నిందితులను అరెస్టు ను విలేకరులకు చూపకపోవడం గమనార్హం. సమావేశంలో రూరల్ సీఐ కొరె కిశోర్, ఎస్‌ఐ రాజకుమార్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో డ్రైవింగ్‌లో శిక్షణ

- టైడ్స్ ప్రిన్సిపాల్ రాఘవన్

సిరిసిల్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన డ్రైవింగ్ శిక్షణ అందిస్తున్న టైడ్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని అంతర్జాతీయ డ్రైవింగ్ శిక్షణ పరిశోధన సంస్థ ప్రిన్సిపాల్ బూవ రాఘవన్, జిల్లా రవాణాశాఖ అధికారి కొండల్‌రావు తెలిపారు. గురువారం అంతర్జాతీయ రహదారి భద్రతా మాసోత్సవం సందర్భంగా తెలంగాణలో అతి పెద్ద తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్ (టైడ్స్)లో అంతర్జాతీయ ప్రమాణాల ద్వారా చేపడుతున్న కార్యకలాపాలు, రహదారి భద్రతపై సదస్సు నిర్వహించారు. జిల్లాలోని పాత్రికేయ బృందం ఇన్‌స్టిట్యూట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రాఘవన్, కొండల్‌రావు మాట్లాడుతూ డ్రైవింగ్ శిక్షణ సంస్థలో మెకానికల్ నాలెడ్జ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. దేశంలో ఏటా 4.50 లక్షల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈ ప్రమాదాల్లో 1.50 లక్షల మంది మరణిస్తున్నారని అన్నారు. ఇందులో యువతనే ఎక్కువగా ఉంటున్నారన్నారు. రోడ్డు భద్రతపై అవగాహన లేకపోవడం సరైన శిక్షణ లేకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. డ్రైవర్లకు శిక్షణ ఇచ్చేందుకు రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మండెపల్లిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అశోక్ లేలాండ్ సంయుక్త ఆధ్వర్యంలో రూ.22 కోట్లతో శిక్షణ సంస్థను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఐదెకరాల్లో పరిపాలన, వసతి గృహ భవనాలు, 15 ఎకరాల్లో డ్రైవింగ్ ట్రాక్‌లు నిర్మించినట్లు వివరించారు. శిక్షణ కాలపరిమితిలో 21 రోజుల కోర్సుకు రూ.7,080, 30 రోజుల కోర్సుకు రూ.16,520, మూడు రోజుల కోర్సుకు రూ.2250, ఒక రోజు కోర్సుకు రూ .750 చొప్పున ఉన్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు వివిధ కోర్సుల్లో 4 వేల మంది అభ్యర్థులు శిక్షణ పొందారని, 350 మందికి ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు లభించాయని అన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో అందిస్తున్న శిక్షణను ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్వో దశరథం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టైడ్స్ ప్రిన్సిపాల్ రాఘవన్

సీసీరోడ్ల నిధులపై పరస్పర దాడులు

పోలీసుల స్టేషన్‌ల్లో ఫిర్యాదు, ఇరువర్గాలపై కేసు

మెట్‌పల్లి రూరల్, జనవరి, 11 : మండలంలోని కొండ్రికర్ల గ్రామంలో ఉపాధి హామీ కింద సీసీ రోడ్ల నిర్మాణానికి చెందిన నిధుల విషయంలో ఇరు వర్గాల మధ్య జరిగిన గొడవతో వారిపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 15లక్షలు మంజూరు కాగా గ్రామానికి చెందిన గడ్డం రాజారెడ్డి, మెండె రమేష్ నిర్మాణం చేపట్టారు. పనులు ప్రారంభించిన సమయంలో సర్పంచు మేనల్లుడు శ్రీనివాస్‌తో వారికి గొడవ జరగింది. దీంతో మెండే రమేష్ అతనిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఇది మనుసులో పెట్టుకొని చేసిన పనులకు నిధులు మంజూరు చేయకుండా అడ్డుకుంటున్నాడని వారిద్దరు అతడిని నిలదీశారు. దీంతో ఇరువురి మధ్య మాటమాటా పెరిగి గొడవకు దారి దీసింది. దీంతో ఆకుల శ్రీనువాసు అయన కుమారుడు ఆకుల మనోహర్‌లతో గడ్డం రాజారెడ్డి, మెండే రమేష్‌లు దాడులు చేసుకున్నారు. దీంతో ఇరువురు చేసిన ఫిర్యాదు మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సొంతగూటికి చేరిన కౌన్సిలర్

కోరుట్ల/మెట్‌పల్లి జనవరి 11 : ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన 18వ వార్డు కౌన్సిలర్ పరహత్ రహీం గురువారం ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. సొంత గూటికి చేరడం తనకు ఎంతో ఆనందంగా ఉందని కౌన్సిలర్ పేర్కొన్నారు. ఎవరికీ పార్టీ మారే అవసరం లేదన్నారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్‌కుమార్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, నాయకులు లక్ష్మీనారాయణ, సజ్జు, బాబా, సనావోద్దీన్, మోసిన్ ఉన్నారు.

నియోజకవర్గంలోని ప్రతి చెరువు నింపుతాం

ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

గొల్లపల్లి, జనవరి 11: నియోజకవర్గంలోని ప్రతి చెరువును నింపే విధంగా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మండలంలోని రంగదామునిపల్లి చెరువును గురువారం అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా గొల్లపల్లి, వెల్గటూర్, పెగడపల్లి మండలాలకు చెందిన రైతాంగం రంగదామునిపల్లె చెరువుపై ఆధారపడి పంటలు సాగు చేసుకుంటున్నారని, ఇక్కడి రైతాంగానికి సాగు, తాగు నీటి విషయంలో శాశ్వత పరిష్కారం చూపాలని సీఎంను కలిసి విన్నవించామన్నారు. ముఖ్యమంత్రి వెంటనే స్పందించి సంబంధిత అధికారులను విచారణ జరిపించాలని ఆదేశించారని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ఈ నియోజకవర్గానికి ప్రాతినిథ్యం వహించిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఈ ప్రాంత ప్రజలకు కనీసం తాగునీటి విషయంలో శాశ్వత పరిష్కారం చూపలేకపోయారన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భాస్కరాచారి, వెల్గటూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, పెగడపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాములు గౌడ్, వెల్గటూర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్, నాయకులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు ప్రజలు సహకరించాలి

మెట్‌పల్లి, జనవరి, 11 : పట్టణంలో నేరాల నియంత్రణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి అన్నారు. గురువారం ఎస్పీ అదేశాల మేరకు పట్టణంలోని చావిడి కాలనీ ప్రాంతంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండగ సందర్భంగా గ్రామాలకు వెళ్లే వారు ఇంట్లోని విలువైన వస్తువులు, బంగారం, నగదును బ్యాంకులో భద్రపరుచుకోవాలని, తమ వివరాలను పోలీసు స్టేషన్‌లో తెలియజేస్తేన దొంగతనాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవడానికి వీలు ఉంటుందన్నారు. సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సై చిరంజీవి పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరికి కేంద్ర పథకాలు చేరాలని ప్రచారం

మెట్‌పల్లి, జనవరి, 11 : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేయాలనే లక్ష్యంతో ప్రచారం చేస్తున్నట్లు బీజేపీ పట్టణాధ్యక్షుడు బోడ్ల రమేస్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని 2వ, 3వ వార్డుల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేయాలనే లక్ష్యంతో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో బాగంగా ఎల్‌ఈడీ స్ర్కీన్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. నాయకులు సుఖేందర్ గౌడ్, సౌజన్య, లావణ్య, ఇందూర్ నవీన్‌కుమార్, నర్సయ్య, రమేష్, రాజేష్ పాల్గొన్నారు.

కలకలం రేపుతున్న ఎక్సైజ్ సీఐ, బార్ ఓనర్ల సంభాషణ

- సోషల్ మీడియాలో చక్కర్లు

మెట్‌పల్లి, జనవరి, 11 : బెల్ట్ షాపు నిర్వాహకులు బార్‌ల నుంచి మద్యం తీసుకోంటే వారిపై దాడులు చేస్తున్నారంటూ ఓ బార్ ఓనర్ ఎక్సైజ్ సీఐతో ఫోన్‌లో జరిపిన సంభాషణ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. మెట్‌పల్లి మండలానికి చెందిన బెల్ట్ షాపు నిర్వాహకుడు పట్టణంలోని బార్ నుంచి మద్యం కొనుగోలు చేసినందుకు వారిపై దాడులు చేపడుతున్నావని ఎక్సైజ్ సీఐ బెదిరించారని బార్ ఓనర్ ఫోన్ లో ప్రశ్నించాడు. దీనికి అధికారి అవును బార్ నుంచి తీసుకోవద్దని, వైన్స్‌ల ద్వారా కొనుగోలు చేపట్టాలని సమాధానం ఇచ్చారు. ఇలా ఇరువురి మధ్య స్వల్ప వాగ్వాదం జరిగి అది కాస్తా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

అదనపు కలెక్టర్ దివాకర

జగిత్యాల టౌన్, జనవరి 11 :విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా అదనపు కలెక్టర్ టీఎస్ దివాకర హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంపులో ఉన్న మాత శిశు ఆసుపత్రిని గురువారం అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజావాణిలో వచ్చిన పలు ఫిర్యాదులపై అనుపత్రి వైద్యులతో పాటు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పలు విభాగాలను సందర్శించి వైద్యులు అందిస్తున్న సేవలను రోగులతో అడిగి తెలుసుకుని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రి కార్యాలయంలో సమీక్ష నిర్వహించి పలు రికార్డులను పరిశీలించారు. సూపరింటెండెంట్ రాములు తదితరులు ఉన్నారు.

అభివృద్ధి చెందిన దేశంగా భారత్

గొల్లపల్లి, జనవరి 11: ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సారథ్యంలో భారత దేశం అన్ని రంగాల్లో అగ్రపథాన నిలిచి అతి త్వరలో అభివృద్ధి చెందిన దేశంగా అవతరించబోతుందని గొల్లపల్లి మండల వికసిత భారత్ అంబాసిడర్, బీజేపీ ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ కస్తూరి సత్యం పేర్కొన్నారు. మండలంలోని ఆత్మకూర్ గ్రామంలో గురువారం జరిగిన వికసిత భారత్ సంకల్ప యాత్రలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సుమారు 320 పథకాలను గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు తెలియజేయడం కోసం వికసిత భారత సంకల్ప యాత్ర గత అక్టోబరు 15వ తేదీన నరేంద్ర మోడీ ప్రారంభించారని తెలిపారు. అర్హులైన గ్రామీణ ప్రాంత ప్రజలు ప్రధాన మంత్రి ఉజ్వల యోజన, ప్రధాన మంత్రి కిసార్ సమ్మాన్ నిధి యోజనలాంటి పథకాలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నవీన్, ఎంపీవో, గ్రామ కార్యదర్శి రాష్ట్ర స్వచ్ఛ భారత్ కన్వీనర్ మంచె రాజేష్, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ కొక్కు లక్ష్మణ్ పాల్గొన్నారు.

చెకుముకి సంబరాల గోడ పత్రిక ఆవిష్కరణ

కోరుట్ల, జనవరి 11 : విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తి, శాస్త్రీయ ఆలోచనను పెంపొందించేందుకు ఏటా నిర్వహించే చెకుముకి సంబరాల గోడ పత్రికను గురువారం ఆర్‌డీఓ రాజేశ్వర్ ఆవిష్కరించారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తుంటారని జిల్లా సైన్స్ అధికారి బాజోజి శ్రీనివాస్ పేర్కొన్నారు. పాఠశాల స్థాయిలో ఈ నెల 19న మండల స్థాయిలో 27న, ఫిబ్రవరి 3న జిల్లా స్థాయిలో ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో 7, 8. 9 తరగతులకు సంబంధించిన విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేవీవీ జిల్లా గౌరవ అధ్యక్షుడు మార్గం రాజేంద్రప్రసాద్, జిల్లా అధ్యక్షుడు ఆగమయ్య, బాస రాములు, చౌడారపు రాంప్రసాద్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు



జగిత్యాలలోని మానస హైస్కూల్‌లో..



కోరుట్లలో ముగ్గులు వేస్తున్న గౌతమ్ పాఠశాల విద్యార్థినులు



ధర్మపురి ఆంగ్లోవేదిక్ కాన్వెంట్ హైస్కూల్‌లో



రాయికల్ వివేకవర్ధిని పాఠశాలలో ..

జగిత్యాల అర్బన్, జనవరి 11: జిల్లా కేంద్రంలోని మానస స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రజితరావు వేడుకలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పొంగలి తయారు చేసి, చిన్నారులపై భోగిపండ్లు పోశారు. అనంతరం భోగి మంటలు వెలిగించి, నృత్యాలు చేశారు. హరిదాసుల కీర్తనల నడుమ బొమ్మల కొలువు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పాఠశాల డైరెక్టర్ శ్రీధర్‌రావు, హరిచరణ్‌రావు, మౌనికరావు, సుమన్‌రావుతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

●పట్టణంలోని జ్యోతి హై స్కూల్ ఐఐటీ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ బియాల హరిచరణ్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

●పట్టణంలోని కృష్ణానగర్‌లో గల ది గ్రావిటీ స్కూల్‌లో ముందస్తు భోగి, సంక్రాంతి సంబరాలు గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులందరూ సాంప్రదాయ దుస్తులు ధరించి ఈ సంబరాల్లో పాల్గొనగా, వారిచే ప్రదర్శించబడిన ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ లక్ష్మీనారాయణ, కరస్పాండెంట్ సంధ్యారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోషకులు పాల్గొన్నారు.

రాయికల్: రాయికల్ పట్టణంలోని వివేకవర్ధిని పాఠశాల, విశ్వశాంతి పాఠశాల, ప్రగతి హైస్కూల్‌తో పాటు మండలంలోని ఆలూరు జడ్పీహెచ్ఎస్ పాఠశాల, ఇటిక్యాల జడ్పీహెచ్ఎస్ పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. రంగవల్లుల పోటీలు నిర్వహించడంతో పాటు బొమ్మల కొలువు, భోగీ మంట ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ మెక్కొండ రాంరెడ్డి, ఉప సర్పంచ్ రాజు వెంకటేష్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బాలె శేఖర్, ఉదయ్ కుమార్, జి.రాజేశం, కరస్పాండెంట్ బాలె జయశ్రీశేఖర్, పాఠశాల డైరెక్టర్‌లు మచ్చ లలిత, విద్యాన్వేష్, నిఖిల్ కుమార్ పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణంలో సిద్ధార్థ గ్లోబల్ పాఠశాలలో గురువారం సంక్రాంతి ముందస్తు సంబరాలు నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యక్షుడు కటుకం జగదీశ్వర్, ప్రిన్సిపాల్ వినోద, మరిపల్లి నవీన్, శిరీష తదితరులు ఉన్నారు.

ధర్మపురి: మండలంలోని పలు పాఠశాలల్లో ముందస్తు సంక్రాతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆంగ్లోవేదిక్ కాన్వెంట్, చైతన్య భారతి విద్యానికేత్, కేరళ ఇంగ్లీష్ మీడియం, విద్యా భారతి, గ్లోబల్ ఇంగ్లీష్ మీడియం, మగ్గిడి మోడల్ స్కూల్స్‌లో వేర్వేరుగా వేడుకలు నిర్వహించారు. పాఠశాలల కరస్పాండెంట్స్ సంగనభట్ల దినేష్, సంగనభట్ల రామకిష్టయ్య, చిలువేరి శ్యాంసుందర్, శ్రీనివాస్, వేణుగోపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ బుచ్చన్న, శంకర్, నాగశ్వేత, శ్రీధర్ పాల్గొన్నారు.

●పట్టణంలోని నవజ్యోతి, గౌతమ్ పాఠశాలల్లో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ముగ్గులు, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. గౌతమ్ పాఠశాలలో విద్యార్థినిలు ముగ్గులు వేసి పాఠశాలలో సంబరాలు చేసుకున్నారు. జిల్లా ట్రస్మా అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, గఫార్, విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

మల్లాపూర్ : మల్లాపూర్ మోడల్ పాఠశాలలోని విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. సిరిపూర్ ఉన్నత పాఠశాల్లో సంక్రాంతి వేడుకలు జరిపారు. విద్యార్థులు రంగురంగుల ముగ్గులు వేసి పండగ వాతావరణం కల్పించారు. సర్పంచు గోవింద్ నాయక్, ప్రధానోపాధ్యాయుడు ఆకుల శ్రీనివాస్, వెంకటరమణ పాల్గొన్నారు.

వెల్గటూర్: మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం ముందస్తు సంకాంతి సంబరాలు నిర్వహించారు. పాఠశాల ఆవరణలో బాలికలు సాంప్రదాయం ఉట్టిపడేలా అందమైన రంగు రంగుల ముగ్గులు వేసి ఆకట్టుకున్నారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సంక్రాంతి పండగ విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు.

మెట్‌పల్లి: పట్టణంలోని బ్రూక్లిన్, సూర్యోదయ, బచ్‌పన్ ప్లే పాఠశాలలో గురువారం విద్యార్థులు ముందస్తుగా సంక్రాంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. బ్రూక్లిన్ ప్రిన్సిపాల్ బుర్ర ప్రసాద్, సూర్యోదయ పాఠశాల కరెస్పాండెంట్ దొంతుల రాజుకుమార్, ఉపాధ్యయులు పాల్గొన్నారు.

కొడిమ్యాల : మండలంలోని పూడూర్ మానేరు ఉన్నత పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. మానేరు విద్యా సంస్థల అధినేత కదారి అనంతరెడ్డి సంక్రాంతి పండగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. అంతక ముందు వేడుకలలో డైరెక్టర్ కదారి సునితారెడ్డి, కట్నపెల్లి లక్ష్మన్ శారదా దంపతులు జ్యోతి ప్రజ్వలన చేశారు. మండలంలోని సంద్రల్లపల్లి ప్రాథమిక పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు ఏనుగు ఆదిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం కండ్లపల్లి మోడల్ స్కూల్‌తో పాటు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భీమారం : భీమారం మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని పాఠశాలల్లో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ గణేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జగదేవ్‌పేట పాఠశాలలో..



మల్లాపూర్‌లో..



కొడిమ్యాల మండలం మానేరులో..



మెట్‌పల్లిలోని బ్రూక్లిన్ పాఠశాలలో..

చిరుత కోసం కొనసాగుతున్న అధికారుల గాలింపు

●సత్యక్కపల్లె శివారులో మరోసారి సంచరించినట్లు అనుమానం

● నాలుగు రోజుల నుంచి భయందోళనలో గ్రామస్థులు

మెట్‌పల్లి రూరల్, జనవరి, 11 : మండలంలోని సత్యక్కపల్లె గ్రామ శివారు లోని అటవీ ప్రాంతంలో మరోసారి చిరుత పులి పాదం గుర్తులు కనిపించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నాలుగు రోజుల నుంచి గ్రామ శివారులో ప్రతి రోజు చిరుత పులి సంచరిస్తున్నట్లు అనుమానాలు ఉండటంతో గ్రామస్థులు, రైతులు ఆందోళన చెందుతున్నారు. గురువారం గ్రామంలోని వరుద కాలువ వెంటా చిరుత సంచరిస్తూ రైతులకు కనిపించింది. దీంతో రైతులు, గ్రామస్థులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. గ్రామ శివారులోని ఉసికె గుట్ట అటవీ ప్రాంతం సమీపంలో ఉన్న నీలి చిన్నారెడ్డి అను రైతు వ్యవసాయ తోటలో నాలుగు రోజులుగా గ్రామ శివారులో చిరుత పులి సంచరిస్తున్నట్లు పాదం గుర్తులను రైతులు, అటవీ శాఖ అధికారులు గుర్తించారు. ప్రతి రోజు పొలాలకు వెళ్లిన రైతులు పులి అడుగుజాడలను గుర్తించడం అధికారులు అక్కడి రావడం పులి పాదం గుర్తులే అని జాగ్రత్తగా ఉండాలని సూచించడం తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్థులు అసమనం వ్యక్తం చేస్తున్నారు. ఫారెస్ట్ రేంజ్ అధికారి సౌకత్‌అలి తన సిబ్బందితో వెళ్లి చిరుత సంచరించిన అటవీ ప్రాంతంలోని ఆనవాళ్లను పరిశీలించారు. సమీప గ్రామాల్లోని రైతులు ఒంటరిగా పొలాలకు వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఈ ప్రదేశంలో నిఘా పెడుతామని ప్రజలు భయాందోళనకు గురికావొద్దని పలు సూచనలు చేశారు. ఈయనతో నాయకులు నేరెళ్ల రాజాగౌడ్, డీఆర్‌వో మహ్మద్ హపీజ్‌ద్దిన్, బీట్ అధికారి శివరాజ్, సిబ్బంది గణేష్ పాల్గొన్నారు.

దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కోరుట్ల, జనవరి 11 : పట్టణ ప్రజలు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరుట్ల పోలీసులు పేర్కొన్నారు. గురువారం రోడ్డు వెంట వెళ్ళే వాహనాలను పోలీసులు తనిఖీ చేశారు. ఆటోకు మైకు బిగించి దొంగతనాలు పెరుగుతున్న నేపథ్యంలో ఇతర గ్రామాలకు వెళ్ళే సమయంలో పోలీసులకు లేదా పక్కింటి వారికి చెప్పాలని ప్రచారం నిర్వహించారు.

30వ వార్డులో ఎమ్మెల్యే పర్యటన

కోరుట్ల, జనవరి 11 : పట్టణంలో గురువారం ఉదయం గుడ్ మార్నింగ్ కోరుట్ల కార్యక్రమంలో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ పాల్గొన్నారు. 30వ వార్డులో పర్యటించి పలువురి నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ, సీసీ రోడ్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ధాన్యం అవకతవకలపై విచారణ

రాయికల్, జనవరి 11 : మండలంలోని అల్లీపూర్ గ్రా మంలో గత రబీ సీజన్‌లో జరిగిన ధాన్యం కొనుగోళ్లలో జరిగిన అవకతవకలపై గురువారం ఐకేపీ అడిషనల్ పీడీ సుధీర్ విచారణ చేపట్టారు. రబీ సీజన్‌లో జరిగిన ధాన్యం కొనుగోలులో నిర్వహకులు రైతుల నుంచి 5-6 కిలోలు ధాన్యం కటింగ్ చేసి అవకతవక లకు పాల్పడ్డారని రైతులు, ఇటీవల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. గురువారం అడిషనల్ పీడీ నిర్వాహకులను, రైతులను పిలిపించి విచారణ చేపట్టారు. రైతులను పిలువకుండ కొనుగోలు నిర్వాహకులతో విచారణ నిర్వహించడంపై ఏంటని అధికారులను నిలదీశారు. కొనుగోలు జరిగి ఇన్ని రోజుల తర్వాత అవకతవకలు గుర్తుకు వచ్చాయా అంటూ అధికారులు రైతులను ప్రశ్నించారు. అధికారుల తీరును నిరసిస్తూ రైతులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు.

ప్రజాభవన్‌లో ఫిర్యాదుకు స్పందించిన అధికారులు

చెక్‌డ్యాం నిర్మించాలని సీఎంకు దరఖాస్తు చేసిన మాజీ ఎంపీటీసీ

ఇబ్రహీంపట్నం, జనవరి 11: మారుముల ప్రాంతం నుంచి వెళ్లి ప్రజాభవన్ కార్యక్రమంలో ఫిర్యాదు చేసిన దరఖాస్తుకు ఆగమేఘల మీద స్పందిస్తూ సమస్యలు పరిష్కరించే దిశగ అడుగు లు వేస్తున్నారు అధికారులు. వేములకుర్తి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ బీఆర్ఎస్ నాయకులు పెంట లక్ష్మీ-తింబాద్రి గత ఎడాది డిసెం బర్ 29న హైదారాబాద్‌లోని ప్రజాభవన్‌లో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వేములకుర్తి గ్రామ శివారులోని గోదావరి నదిపై రట్నల మడుగు వద్ద చెక్ డ్యాం నిర్మించి నీటి నిల్వ ఉంచి రైతులను ఆదుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డికి దరఖాస్తు చేశారు. సమస్యను ఉన్నతాధికారులు కలెక్టర్‌కు బదలాయించారు. కలెక్టర్ ఆదేశాలతో ఇరిగేషన్ ఈఈ వేంకటేశ్వర్లు, సిబ్బందితో కలిసి గురువారం గోదావరి నది పరివాహక ప్రాంతాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చెక్ డ్యాం నిర్మాణ ఏర్పాటుకు గోదావరిపై పరిశీలన చేసున్నట్లు తెలిపారు. అనువైన స్థలాన్ని గుర్తించి పూర్తి నివేదికలను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు.

'ప్రభుత్వ విప్ అడ్లూరిని విమర్శిస్తే సహించేది లేదు'

వెల్గటూర్, జనవరి 11: ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను విమ ర్శిస్తే సహించేది లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేంధర్‌రెడ్డి హెచ్చరించారు. ఎంపీపీపై అవిశ్వాస తీర్మాణం విషయంలో చేసిన అసత్య ఆరోపణలు ఖండిస్తూ కాంగ్రెస్ నాయకులు గురువారం వెల్గటూర్‌లో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ఎవరు ఏంటిదో, ఎవరి ప్రలోభాలకు ఎవరు లొంగారో ప్రజలకు అన్నీ తెలుసన్నారు. అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఎమ్మెల్యేగా గెలువక ముందు, గెలిచినప్పటి నుంచి ప్రజల మధ్యనే ఉంటూ సుపరిపాలన అందించాలనే ధ్యేయంతో ముందుకు సాగుతున్నారని తెలిపారు. అంబారిపేట ఎంపీ టీసీ జాడి సుజాత మాట్లాడుతూ పది మంది ఎంపీటీసీలు ప్రస్తుత ఎంపీపీ లక్ష్మి పని తీరు నచ్చక వారి ఇష్టంతో సంతకాలు చేసిన అవిశ్వాస తీర్మానం ఆర్డీవోకు అందజేశారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఎంపీటీసీలను ప్రభుత్వం పట్టించుకోక పోవడం వలననే ఎంపీటీసీలు అవిశ్వాసానికి మొగ్గు చూపారని పేర్కొన్నారు. ఇద్దరు ఎంపీటీసీలను డబ్బులకు ప్రలోభపెట్టి, భయభ్రాంతులకు గురి చేసి కక్ష పూరితంగా అవిశ్వాసం వీగి పోయేలా చేసిన బీఆర్ఎస్ నాయకులు తమపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మేరుగు మురళి, అనుమాల మంజుల, బందెల ఉదయ్, గెల్లు శేఖర్, గంధ్ర శ్రీకాంత్‌రావు, రమేష్, వెంకటేష్, మేరుగు నరేష్, గాజుల విజయ్, వెంకటస్వామి పాల్గొన్నారు.

సమస్యలు ఉంటే నేరుగా సంప్రదించాలి

ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి, జనవరి, 11 : నియోజక వర్గంలోని పాఠశాలలు, కళాశాలలో ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా సంప్రదించాలని, ఎప్పుడు అందుబాటలో ఉండి అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మంచి నీరు, సిబ్బంది కొరత ఉన్న విషయం అయనకు తెలిపారు. వెంటనే మున్సిపల్ కమిషనర్ ఫోన్ చేసి విద్యార్థులకు మంచి నీటి సమస్యను పరిష్కరించాలని, జిల్లా విద్యాశాఖ అధికారితో ఫోన్‌ల్లో మాట్లాడి సిబ్బంది కొరతను ఉన్నందున వెంటనే ఖాళీలను పరిష్కరించాలని కోరారు. కళాశాల ఉపన్యాసకుల సహకారంతో అందజేస్తున్న ఉచిత మధ్యాహ్న భోజన కార్యక్రమం ప్రారంభించి విద్యార్థులకు వడ్డన చేసి వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమ శిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఎంచుకున్న లక్ష్యం కోసం నిరంతరం కృషి చేసి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కలలను సార్థకం చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, వారికి ఇబ్బందులు తలెత్తకుండా సమస్యలు ఉంటే ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకరావాలన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజన కార్యక్రమం చేపట్టిన ఉపన్యాసకులను అభినందించారు. విద్యార్థులు ఉపద్యాయుల పట్ల క్రమశిక్షణతో మెదగాలని, వారు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకొని చెప్పిన పాటలను అర్థం చేసుకొని పరీక్షల్లో మంచి ఫలితాలను సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి బొప్పరాతి నారాయణ, ప్రిన్సిపాల్ రావులపల్లి వెంకటేశ్వ రరావు, ఉపన్యాసకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్

సంక్షిప్త సమాచారం

కొడిమ్యాల : మండలంలోని అప్పారావుపేట వాగుపై పురాతన మత్తడి అకాల వర్షాలకు గండి పడినందున మత్తడిని పునరుద్దరించాలని కోరుతూ అప్పారావుపేట గ్రామస్థులు ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యంకు వినతి పత్రం అందించారు. సింగిల్ విండో డైరెక్టర్ నర్సింహారెడ్డి, అప్పారావుపేట గ్రామ రైతులు ఉన్నారు.

● కొడిమ్యాల పట్టణ పడమటి వాడ రెడ్డి సంఘం అధ్యక్షుడిగా చెన్నాడి తిరుపతిరెడ్డిని సభ్యులు ఎన్నుకున్నారు. మారు నరేందర్‌రెడ్డి, కోశాధికారిగా సింగిరెడ్డి ఎల్లారెడ్డి, రైటర్‌గా జగిడి అనంతరెడ్డిని ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా పిడుగు మల్లారెడ్డి, పాశం రాంరెడ్డి, పాదం శంకర్, గడ్డం రాజు, పొద్దుటూరి దేవరెడ్డి, పిడుగు అనిల్, క్యాతం రాజేశ్వర్‌రెడ్డి, సింగిరెడ్డి రవీందర్‌రెడ్డిని ఎన్నుకున్నారు.

● మండలంలోని తిర్మాలాపూర్ గ్రామపంచాయతీ ఆవరణలో గురువారం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలపై వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో బాగంగా అధికారులు అవగాహన కలిపించారు.

● మండల రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌ఏగా విధులు నిర్వహిస్తూ గుమ్మడి ధర్మపురి(68) గురువారం అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందినట్లు తోటి సిబ్బంది తెలిపారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ రవికాంత్, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, రెవెన్యూ పరిశీలకుడు రవి, సిబ్బంది వచ్చి సంతాపం వ్యక్తం చేశారు. మృతునికి భార్య సంతోషవ్వ, నలుగురు కుమారులు ఉన్నారు. కొడిమ్యాల ఎస్సై కె. వెంకట్‌రావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

● మండలంలోని నమిలికొండ గ్రామ శివారులో ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటుకై ప్రభుత్వ స్థలాన్ని భూసేకరణ విభాగం డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసరావు పరిశీలించారు. స్థలం స్కూల్‌కు అనువుగా ఉంటుందా లేదా అనే అంశాన్ని పరిశీలించారు. తహసీల్దార్ రవికాంత్ ఉన్నారు.

రాయికల్: స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛ సర్వేక్షణ్-2023 కార్యక్రమంలో రాయికల్ పట్టణానికి ఓడీఎఫ్ ప్లస్ గ్రేడింగ్ వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ సంతోష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సర్వే సర్వేక్షణ్ 2023 పోటీల్లో రాయికల్ పట్టణం జోనల్‌లో 14వ ర్యాంక్ సాధించినట్లు పేర్కొన్నారు.

మెట్‌పల్లి : రెండు నెలలుగా వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్న కార్మికులకు వెంటనే చెల్లించాలని కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకురుల సమావేశంలో వారు మాట్లాడారు.

వెల్గటూర్: మండలంలోని జగదేవ్‌పేట గ్రామానికి చెందిన మానుపాటి రవీందర్ (31) అనే యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై శ్వేత తెలపిన వివరాల ప్రకారం.. మృతుడు రవీందర్‌కు ఎనిమిదేళ్ల క్రితం అల్లంపల్లికి చెందిన సౌందర్యతో వివాహం జరిగింది. వారికి ఇద్దరు సంతానం ఉన్నారు. మృతుడి బార్య ఇతరులతో వివాహేతర సంబంధం పెట్టుకొని అతన్ని కుటుంబ సభ్యులతో కలిసి వేదించినందుకు మనస్తాపంతో గత నెల 22న పురుగుల మందు తాగాడు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. గురువారం మృతుడి తండ్రి మానుపాటి కనకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

- వికాస్ భారత్ సంకల్ప యాత్ర ప్రచార రథం గురువారం వెల్గటూర్‌కు చేరింది. ప్రధాని మోదీ దేశంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వీడియో స్ర్కీన్ ద్వారా ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి, నోడల్ ఆఫీసర్ రజినీకాంత్, కార్యదర్శి శ్రీనివాస్, సర్పంచ్ మేరుగు మురళి, ఉపసర్పంచ్ సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

- వెల్గటూర్ మండలానికి ఒక సెంట్రల్ స్కూల్ ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ నిర్ణయించిన నేపథ్యంలో గురువారం మండలం లోని స్థంభంపల్లి శివారులో ఆర్డీవో నర్సింహమూర్తి స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థభంపల్లి శివారుల ఓని 1090 సర్వే నంబరులో 10 ఎకరాల స్థలాన్ని పరిశీలించినట్లు ఆర్డీవో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వెంట తహశీల్దార్ శేఖర్, ఆర్ఐ రాజేశ్వరి ఉన్నారు.